

కథ

# మూలసత్రం

## బి.పి.కరుణాకర్

ఆ ప్రాంతం నాకు బొత్తిగా కొత్త కాకపోయినా ఏడేళ్లతో పోల్చి చూస్తే నేను ఊహించనంతగా మారిపోయింది. రాత్రి పదీ ఇరవయి అయింది. వర్షం ఒక మోస్తరుగా కురుస్తోంది. వెనక సీట్లో హేమలత నిద్రపోతోంది. కారు నెమ్మదిగా నడుపుతున్నాను. వయిపర్లు ఉండుండి పనిచేస్తున్నాయి. అలవాటయిన దారి అయి ఉంటే ఎటువంటి ఇబ్బంది పడి ఉండే వాడిని కాదు. రోడ్డు కూడా మంచిగా లేదు. ఎక్కడ గుంటలున్నాయో ఎక్కడ లేవో తెలియడం లేదు.

ఉదయం విజయవాడలో బయల్దేరినప్పుడు చిన్నయసూరి డ్రయివరును ఇస్తానంటే నేనే వద్దన్నాను. అప్పటికి వర్షం లేదు. పగటిపూట కాబట్టి గమ్యం వరకు ప్రయాణం సజావుగానే సాగింది. తిరిగి ఎంత త్వరగా బయల్దేరదామనుకున్నానో అంత ఆలస్యం అయింది. ఈ రాత్రికి విజయవాడ చేరుకోగలిగితే రేపు ఉదయం ఫ్లయిటులో హైదరాబాద్ చేరుకుని- రేపు సాయంత్రానికల్లా ఢిల్లీలో ఉండాలి. కార్యక్రమం బిగుతుగా ఉంది. చీరాలలో బయల్దేరినప్పుడు వర్షం వచ్చే సూచనలు లేవు. వచ్చినంత తేలికగా వెళ్లిపోవచ్చనే అనిపించింది. మధ్యలో వర్షం పట్టుకుంది. దారి తప్పినట్టున్నాను. ఎక్కడ ఉన్నానో తెలియడం లేదు. ఈ రాత్రికి విజయవాడ చేరుకోవడం కష్టం. కొద్దిసేపు ఎక్కడయినా ఆగి విశ్రాంతి తీసుకుంటే కాని నా బుర్ర పనిచేయదు.

మరో పది నిమిషాలు ప్రయాణం చేశాక ఊరు చివర 'ఉదయ నివాస్' అని రాసి ఉన్న బోర్డు చూశాక నా ప్రాణం లేచొచ్చింది. అది కొత్తగా కట్టబడిన రెండు అంతస్తుల భవనం. అది లాడ్జో, బోర్డింగో తెలియడం లేదు. బోర్డు మీద కూడా ఏం రాసి ఉండలేదు. లాడ్జింగ్ అయితే ఒక గది తీసుకుని తెల్లవారే వరకు ఉండొచ్చు, హేమలత కోసం. ఎ.సి. కారు అయినా ఇంత టీడియస్ ప్రయాణానికి ఆమె తట్టుకోలేదు. బయటకు కనబడేంత ఆరోగ్యవంతురాలు కాదు.

హోటలు కాంపౌండు గేటు బార్లా తెరిచి ఉంది. బయట నాలుగయిదు కార్లు, మూడు నాలుగు మోటరు బైక్‌లు పార్కు చేయబడి ఉన్నాయి. గోడ పక్కగా కారాపి తలుపు కొద్దిగా తెరిచాను. లైటు వెలిగింది. హేమలత వంక చూశాను. బాగా అలిసిపోయినట్టుంది. నిద్రలోంచి తేరుకోలేదు. అదృష్టవంతురాలు. చిటికెలో నిద్రపోతుంది. నాకు ఒహ పట్టాన నిద్ర పట్టదు. రోజుకు నాలుగు గంటల పాటు నిద్రపోతే గొప్ప. కారు దిగి తలుపు వేశాను. కారులో ఉన్నప్పుడు తెలియలేదు కాని వర్షం బాగానే కురుస్తోంది. పరుగెత్తుకుంటూ వెళ్లి హోటలు తలుపు తట్టాను.

పావు నిమిషం తర్వాత గడియ తీసిన చప్పుడు వెనకే తలుపు కొద్దిగా తెరుచుకుని ఇరవయి అయిదేళ్ల యువకుడి ముఖం కనిపించింది. సన్నగా, నల్లగా ఉన్నాడు.

"నాకు గది కావాలి" అన్నాను.

"వర్షంలో తడుస్తున్నారు. ముందు లోపలికి రండి" అన్నాడు. అని తలుపు మరికొద్దిగా తెరిచాడు. జల్లుతో పాటు లోపలికి వచ్చాక, "బాగా తడిచిపోయారు" అన్నాడు.

జేబులోంచి రుమాలు తీసి ముఖం మీది తడి తుడుచుకుంటూ, "నాకూ నా భార్యకూ ఒక గది కావాలి" అన్నాను.

హోటలు సింపుల్‌గా, మంచిగా ఉంది. అతను తెల్లటి పేంటు మీద బూడిదరంగు టి షర్టు వేసుకున్నారు.

తల అడ్డంగా ఆడించి, "సారీ అండీ, ఒక్క గది అయినా ఖాళీగా లేదు" అన్నాడు. మాటల్లో మన్నన ఉంది.

"నా పేరు మణిలాల్. ఢిల్లీలో ఉంటున్నాను. ఒక పని మీద చీరాల వచ్చి తిరిగి విజయవాడ వెళ్తూ వర్షం వల్ల ఆగిపోవలసి వచ్చింది".

"విజయవాడ వెళ్లవలసినవాళ్లు ఇటెందుకు వచ్చారు?"

నా అనుమానం నిజమయింది. దారి తప్పాను. "ఇదే ఊరు?" అడిగాను.

"చందోలు".

అతని ముఖంలోకి చూస్తూ తల అడ్డంగా ఆడించాను. మెయిన్ రోడ్డుకు చాలా దూరం వచ్చేశాను. ఎవరినయినా అడిగి ఉండవలసింది. నాకు ఆత్మోన్నతాభావం ఉంది.

"తువ్వాలు ఇస్తాను. ముందు తల తుడుచుకోండి" అని "వద్దు వద్దు" అంటున్నా బీరువా తలుపు తెరిచి కొత్త తువ్వాలు తీసి నాకు అందించాడు.

తల తుడుచుకుంటూ, "కారులో నా భార్య ఉంది". సామాన్యంగా నేను ఎవరినీ ఏదీ అభ్యర్థించను. నా మాటలో అభ్యర్థన ఉన్నట్టు నాకే అనిపించింది.

"మీతో నేను అబద్ధం చెప్పడం లేదు. నిన్నటి వరకు సగం గదులు ఖాళీగానే ఉన్నాయి రేపు ఈ ఊళ్లో ఒక పెద్దాయన కూతురు పెళ్లి ఉండడం వలన గదులన్నీ నిండిపోయాయి."

"దగ్గరలో మరో హోటలేదయినా ఉందా?"

"లేదండీ."

ఎక్కడలేని నిరుత్సాహం నన్ను ఆవరించింది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. నేనొక్కడినే అయి ఉంటే ఏ బాధా పడేవాడిని కాదు. దీర్ఘంగా నిట్టూర్చి, "ఈ హోటలు నీదా?" అడిగాను.

"కాదండీ. నేనిక్కడ పని చేస్తుంటాను."

తువ్వాలు అతనికి తిరిగి ఇచ్చేస్తూ, "నీ పేరు?" అడిగాను.

"వరప్రసాద్."

"మీ ఓనరుతో మాట్లాడొచ్చా?"

నవ్వి, "తప్పకుండా. నేను మీతో అబద్ధం చెప్పడం లేదు. ఆయన ఫోను నెంబరు మీకిస్తాను.మాట్లాడండి" అని ఫోను నా ముందుకు జరిపాడు. గదులు ఖాళీ ఉన్నా కస్టమర్ల అవసరంకొద్దీ ఎక్కువ డబ్బులు గుంజడానికి లేవని చెప్పడం సామాన్యంగా జరిగే విషయమే. నేనెవరినో అని చెప్పుకుంటే ఆ హోటలు ఓనరు నాకు ఏదో గది ఇవ్వకపోడా అన్న ఆశ.రిసీవరు చేతిలోకి తీసుకున్నాను కాని చేయబుద్ధి కాలేదు. పెట్టేశాను. వెనక్కి తిరిగి తలుపు వయిపు అడుగులు వేస్తోంటే, "సార్" అన్నాడు.

ఆగాను. అతను నా పక్కకు వచ్చి, "మీకు ఎటువంటి అభ్యంతరం లేకపోతే మీరు నా గది ఉపయోగించుకోవచ్చు" నమ్రతగా అన్నాడు. ముక్కూ ముఖం తెలియని నాతో అతను నమ్రతగా ఉండవలసిన అవసరం లేదు. అదీ, నాలాటి అహంభావితో.

"నీ గది చూపించు" అన్నాను.

అతని గది చూపించాడు. డబుల్ బెడ్‌రూం. అన్నీ శుభ్రంగా అమర్చబడి ఉన్నాయి. గది మధ్యలో మంచం ఉంది. గోడపక్క ఉన్న బల్ల మీద చాలా పుస్తకాలున్నాయి.

"నీ గది మాకిస్తే నువ్వు ఎక్కడ పడుకుంటావు?"

"ఇదో ఈ సోఫాలో పడుకుంటాను. చాలాసార్లు రాత్రంతా మెలకువగా ఉంటాను. నా గురించి మీరేం బాధపడకండి. మీకు గది నచ్చిందా?"

తలూపి, "నీ గది మాకు ఇచ్చినందుకు మీ ఓనరు నీ మీద అరవడా?" అడిగాను.

"అరవడు. ఒకరికి కష్టం కలిగించే పనులు నేను చేయనని ఆయనకు తెలుసు" అన్నాడు.

బ్రెడ్, పాలు తీసుకున్నాక హేమలత అతని గదిలో పడుకుంది. వరప్రసాద్‌కు వంటొచ్చు. మా ఇద్దరి కోసం చపాతీలు, ఆమ్లెట్లు చేశాడు. కలిసి భోజనం చేశాం. అంత ప్రేమ కలిగిన మనిషితో కలిసి భోజనం చేయడం నాకు అదే మొదటిసారి. నేను నేర్చుకోని విషయాలు చాలా ఉన్నట్టు అనిపించింది. ఆ తర్వాత గదిలోకి వెళ్లి మంచం మీద పడుకున్నప్పుడు మరుసటి రోజు నేను సంతకం పెట్టబోయే కాంట్రాక్టు గుర్తు రావడం వలనేమో, కొత్త ప్రదేశం అవడం వలనేమో వెంటనే నిద్ర పట్టలేదు. చాలాసేపు కొట్టుకులాడి, మంచం దిగి బయటకు వచ్చాను. అతను కుర్చీలో కూర్చుని చదువుకుంటున్నాడు. ముందు అదేదో నవల అయి ఉంటుందనుకున్నాను. కాదు.

ఢిల్లీ చేరుకోగానే నేను చేసిన మొట్టమొదటి పని- నా పర్సనల్ సెక్రటరీని పిలిచి వరప్రసాద్‌ను మా హోటలులో మేనేజరు (హెచ్.ఆర్)గా నియమిస్తూ ఒక ఉత్తరం రాసి అతని చిరునామా ఇచ్చి ఎంత వీలయితే అంత త్వరగా కొరియరులో పంపించమని చెబుతున్నప్పుడు ఆమె కొన్ని వివరాలు, డేటా ఫీడ్ చేసుకోడానికి అడిగింది.

"అతనేం చదువుకున్నాడు?"

"మేథ్స్‌లో పి.జి.చేస్తున్నాడు."

"వయసు?" ఉజ్జాయింపుగా చెప్పాను.

"పుట్టిన తేదీ?" "తెలియదు."

"రిఫరెన్స్" "నా పేరు రాయి."

ఆశ్చర్యపోతూ నా ముఖంలోకి చూసింది. ఏమిటిలా మారిపోయానా అని కావచ్చు. మరొకరు అయితే నన్ను ఇన్ని ప్రశ్నలు వేయరు. నా ముందుకు రావడానికే భయపడుతుంటారు.ఈ అమ్మాయికి నాదగ్గర కొద్దిగా చనువు ఉంది.నా పిల్లలు కూడా నాకు దూరంగా మెలుగుతుంటారు.

"తలిదండ్రులు ఏం చేస్తుంటారు?"

"లేరు. అతని చిన్నప్పుడే చనిపోయారు."

"హోటలు మేనేజ్‌మెంటులో డిప్లొమా కాని, ఏ స్టార్ హోటలులోనయి నా పని చేసినా అనుభవం ఉందా?"

"లేదు శిక్షణ మనం ఇవ్వాలి"

"ప్రస్తుతం అతనికి జీతం ఎంతిస్తున్నారు?"

"ఏడొందలు."

"ఇప్పుడు ఎంత ఇద్దామని అనుకుంటున్నారు?"

"ఈ సంగతి నేనూ ఆలోచించలేదు. ఎంతివ్వొచ్చు?"

మూడు క్షణాల పాటు నా ముఖంలోకి చూసింది. వీలయినంత మటుకు నా భావాల్ని ఎదుటివాళ్లు చదివే అవకాశాన్ని ఇవ్వను. నవ్వి, "అతనికున్న క్వాలిఫికేషన్స్‌తో ఎంతివ్వొచ్చో చెప్పు" అన్నాను.


"మూడు ఇవ్వొచ్చు."

"ఇంకో సున్నా కలుపు."

"ఎక్స్‌క్యూజ్‌మీ." ఆమె ముఖంలో ఆశ్చర్యం కనిపిస్తోంది.అంత జీతం ఆమెకే ఇవ్వడం లేదు. నేను నవ్వులాటకు అంటున్నానో, నిజంగా అంటున్నానో ఆమెకు అర్థం కావడం లేదనుకుంటాను. నేను ఆమెకు కొత్తగా కనిపిస్తూ ఉండొచ్చు." "ముప్పయి కె" అన్నాను.

ఆమె నా గదిలోంచి బయటకు వెళ్తోంటే, "మేకిట్ ఫాస్ట్" అన్నాను.

"యస్ సార్" ఆమె వెళ్లిపోయాక బల్ల సొరుగులోంచి కాంట్రాక్ట్ ఫైలు తీశాను. వరప్రసాద్ తన గురించి నాతో ఒక్క మాటయినా చెప్పలేదు.



రాత్రి ఇద్దరం కలిసి భోజనం చేసేప్పుడు కూడా నా గురించి నేను చెప్పు కుంటోంటే ఆసక్తిగా విన్నాడు. ఉదయం మేం నిద్ర లేచేసరికి వేడి కాఫీ తయారుచేసి ఇచ్చాడు. టిఫిన్ చేస్తానన్నాడు. వద్దన్నాను. వచ్చేస్తూ రెండు వందల రూపాయలు అతనికి ఇవ్వబోతోంటే తీసుకోలేదు. విజయవాడ వెళ్లే రోడ్డు చూపించడానికి మాతో పాటు కారులో అతను పంపించిన వ్యక్తి అతని గురించి చెప్పి కారు దిగిపోయేప్పుడు అన్నాడు, "వరప్రసాద్‌కు ఏడు వందలో, ఎంతో జీతం వస్తుంటుంది. రెండు వందలు మటుకు తన అవసరాలకు ఉంచుకుని మిగిలినదంతా పుస్తకాలు కొనుక్కోలేని పిల్లలకు పుస్తకాలు కొనిస్తాడు. గుడ్డలు లేని పిల్లలకు గుడ్డలు కొనిస్తాడు. పిల్లలకు ట్యూషన్లు చెబుతుంటాడు..."

అపాయింటుమెంటు లెటరు పంపి రెండు, మూడు వారాలు, నెల గడిచింది. వరప్రసాద్ రాలేదు. అది చేరిందో లేదో అని మరొకటి పంపించాను. దానికీ జవాబు లేదు. మర్యాదకోసమయినా జవాబు ఇచ్చి ఉండొచ్చు కదా అనుకున్నాను. అతని మీదున్న అభిమానం కోపంగా మారాక ఉండబట్టలేక ఫోను చేశాను. దొరికాడు. కోపంతో అతని మీద అరుద్దామనుకున్నవాడిని అతని కంఠస్వరం విన్నాక తగ్గింది.

"ఎలా ఉన్నావు?" అడిగాను.

"బావున్నానండీ. మీ ఉత్తరాలు అందాయి. నా మీద మీకున్న అభిమానానికి కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలో..." అతని మాటలు పూర్తి కాకముందే అడిగాను, "ఎప్పుడొస్తున్నావు?" అతను వెంటనే జవాబు చెప్పలేదు. మూడు క్షణాలపాటు మవునంగా ఉండి, "రావడం లేదండీ... మీరంటే గౌరవం లేదని కాదు... నా మనసులో మాట చెబుతున్నందుకు దయచేసి మీరేమీ అనుకోకండి...సమస్య మీతోకాదు... నాతోనే... నేను మీ దగ్గర ఇమడలేనండీ...ఎదుటి వ్యక్తిలోని ఆత్మను మీరు ఎదగనీయరు..." అంటున్నాడు... ఫోను పెట్టేశాను.